క్లుప్తంగా

'ఆరోగ్యశ్రీ'ని సద్వినియోగం చేసుకోండి

జడ్చర్ల: పేదలకు ఉచితంగా వైద్యం అందించాలన్న ఉద్దేశంతో అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ విజయ్‌బాస్కర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని చిట్టెంబోయినపల్లి గురుకుల విద్యాలయంలో అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శిరీష, విష్ణు, రఘురాములు, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

కందూర్‌లో భక్తుల పూజలు

అడ్డాకుల: మండలంలోని కందూర్ శివారులోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా సోమవారం భక్తుల రద్దీ పెరిగింది. వివిధ గ్రామాల నుంచి ఆలయానికి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల సహకారంతో ఆలయం వద్ద నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

మెడికల్ దుకాణం తనిఖీ

మహమ్మదాబాద్: మండల కేంద్రంలోని మెడికల్ దుకాణాలను జిల్లా డ్రగ్ అధికారులు షేక్ రబియ, రష్మి తనిఖీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ఓ మెడికల్ షాపులో సోమవారం ఎలాంటి ధరలకు మందులు అమ్ముతున్నారు? ఏఏ మందులు ఉన్నాయి? దుకాణం నిర్వహణ విషయాలను పరిశీలించారు. కొన్ని రోజులుగా మైనర్‌చే ప్రజలకు మందులను అమ్ముతున్నట్లు ఫిర్యాదు రావడంతో తనిఖీ చేసినట్లు తెలిపారు. మెడికల్ షాపు యజమాని మైనర్‌చే మందులు అమ్మించలేదని బుకాయించడంతో ఫిర్యాదుదారు వీడియోలను చూయించగా అధికారులు షాపు యజమానిపై మండిపడ్డారు. సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక పంపించనున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

దేవరకద్ర: మేజర్ పంచాయతీ పరిధిలోని 10వ వార్డులో సోమవారం సీసీ రోడ్డు పనులు ఈఓ సీత్యానాయక్, వార్డు సభ్యుడు యుగంధర్‌రెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. వార్డుల్లో అవసరం ఉన్న చోట పంచాయతీ నిధులతో సీసీ రోడ్లను వేస్తున్నామని ఈఓ తెలిపారు.

కుష్టు గుర్తింపుపై సర్వే

మహమ్మదాబాద్: కుష్టు వ్యాధిని గుర్తించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు కుష్టు నివారణ ప్రోగ్రాం అధికారి జరీనాబాను తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో చికిత్సలు నిర్వహించారు. మండలంలో 14రోజుల ప్రత్యేక కార్యక్రమం ఉంటుందన్నారు. వ్యాధిపై ఎలాంటి అనుమానం వచ్చినా ప్రజలు తప్పకుండా చికిత్సలు చేయించుకోవాలని సూచించారు.

రెడ్‌క్రాస్ సేవలు విస్తరించాలి

పాలమూరు: రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తరించేందుకు ప్రతి ఒక్కరూ రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని కలెక్టర్ రవినాయక్ సూచించారు. రెడ్‌క్రాస్ ద్వారా విశిష్ట సేవలందించిన అడ్డాకుల టోల్‌గేట్ చీఫ్ దీపిక, ఎంవీఐ నరేష్, డీఎంహెచ్ఓ కృష్ణ, డీఈవో రవీందర్, పీయూ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ, ఎంవీఎస్ కళాశాల ప్రొఫెసర్ లక్ష్మయ్య, బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ సహాసిని, వీహెచ్‌పీ లక్ష్మీనారాయణలకు అవార్డులు, ధ్రువపత్రాలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు విస్తృతస్థాయిలో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో చైర్మన్ నటరాజ్, జగపతిరావు, అశ్విని చంద్రశేఖర్, చంద్రశేఖర్, అంజయ్య, వసుంధర, వెంకటేష్, రవి పాల్గొన్నారు.

యువ ఉద్యోగ యాప్ కరపత్రాలు విడుదల


భూత్పూర్: పట్టణంలో సోమవారం ఆలన్న యువ ఉద్యోగ యాప్ కరపత్రాలను మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ విడుదల ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంస్థలకు చెందిన 2లక్షల ఉద్యోగాలు, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి 20వేల ఉద్యోగాలు నోటిఫికేషన్ వివరాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. 18 నుంచి 44 ఏళ్లలోపు వయస్సు ఉన్న పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి దేవరకద్రలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ టవర్ పనులు ప్రారంభం

నవాబుపేట: మండలంలోని గురుకుంటలోని ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి నిధుల ద్వారా మంజూరైన బీఎస్ఎన్ఎల్ టవర్ పనులు సోమవారం సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, ఎంపీపీ అనంతయ్య, సర్పంచ్ లక్ష్మమ్మ పలువురు ప్రారంభించారు. గురుకుంటతో పాటు కామారంలో సెల్‌ఫోన్ సిగ్నల్ సరిగా రావడం లేదని గ్రామస్తులు ఎంపీకి వివరించడంతో టవర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు వారు తెలిపారు.

తప్పులతడకగా ఓటరు జాబితా

- మృతి చెందె పదేళ్లయిన తొలగించని వైనం
- పేరు ఒకరిది ఫోటో మరొకరిది..
- నాలుగు సార్లు సర్వే చేసినా అవి తప్పులు



పేరు మహిళది ఫోటో పురుషునిది



గాధిర్యాల్‌లో డబుల్‌పేర్లు వచ్చిన ఓటరు జాబితా

మహమ్మదాబాద్: అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో చేపడుతున్న ఓటరు ప్రక్రియ కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యం వల్ల విఫలమవుతుంది. ప్రభుత్వం ఇటీవల ఓటరు ఐడీ కార్డుకు ఆధార్‌ను అనుసంధానం చేస్తున్నామంటూ నెలల తరబడి బీఎల్ఓలతో తొలగించేందుకు సమయం కూడా ఇచ్చారు. అది అమలు కాలేక మళ్లీ ఎప్పటి మాదిరిగానే ఓటరు జాబితా తప్పుల తడకగా చివరిదశకు చేరుకుంది.

57,016 మంది ఓటర్లు..

మహమ్మదాబాద్, గండేడ్ మండలాల వ్యాప్తంగా 49 పంచాయతీలు ఉండగా 28,930 మంది పురుషులు, 28,086 మంది మహిళలు మొత్తం 57,016 మంది ఓటర్లు ఉన్నారు. వారు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆయా గ్రామాల్లో 69 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో అధికారులు ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేశారు. ఇప్పటికే నాలుగు సార్లు సవరణ ప్రకియ చేపట్టినా చివరి అవకాశంగా గ్రామాల్లో ఇప్పటికీ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ఇటీవల బీఎల్ఓల సమావేశం ఏర్పాటు చేసి జాబితాను పంచాయతీ ఆధ్వర్యంలో ఉంచారు. కొత్తగా పేర్లు నమోదు చేసుకునేందుకు మళ్లీ అవకాశం ఇచ్చారు. గాధిర్యాల్ చెందిన మాచారం రాములమ్మ 8ఏళ్ల క్రితం మృతి చెందినా ఇప్పటికీ ఆమె పేరు జాబితాలో ఉంది. ఇలా ప్రస్తుతం ఉన్న జాబితా మాత్రం పదేళ్ల క్రితం చనిపోయిన వారి పేర్లు, ఏళ్ల క్రితం వివాహమై వెళ్లిపోయిన వారి పేర్లు, పేరు ఒకరిది ఫొటో మరొకరిది ఇలా ఎన్నో తప్పులతో జాబితా దర్శనమిచ్చింది. పేరు మహిళది ఉండి ఫొటో పురుషునిది ఉన్నా సరిచేయకపోవడంతో నిజమైన ఓటరు ఎవరన్నది ప్రశ్నార్థకంగా మారుతుందని ప్రజలు వాపోతున్నారు.

జాబితా సరిచేయిస్తున్నాం..

ఇప్పటికే ఆయా గ్రామాలకు ఇచ్చిన ఓటరు జాబితాలో చనిపోయిన, డబుల్ పేర్లు ఉన్నమాట వాస్తవమే. ప్రస్తుతం అలాంటి వాటిని తొలగించేందుకు ప్రత్యేక ప్రక్రియ కొనసాగిస్తున్నాం. సెప్టెంబర్ 26 నాటికి ప్రభుత్వం ఇచ్చిన గడువు లోపు ఇలాంటి పేర్లను తొలగించేందుకు ఆదేశాలు ఇచ్చాం. ఆర్డీఓ లాగిన్ ద్వారా పేర్లను తొలగిస్తాం. అన్ని గ్రామాల్లో త్వరలో ఎలాంటి తప్పులు లేకుండా జాబితా తయారు చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

– ఏసయ్య, తహసీల్దార్, మహమ్మదాబాద్

జూలపల్లికి రోడ్డు వేయాలని వినతి

మహమ్మదాబాద్: మండలంలోని జూలపల్లికి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందని సోమవారం కలెక్టర్ రవినాయక్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందించారు. నంచర్లగేట్ నుంచి జూలపల్లికి వెళ్లే రోడ్డు 15ఏళ్ల క్రితం వేశారన్నారు. రోడ్డు వేయాలని పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలిపినా ఫలితం లేకపోయిందని వారు వాపోయారు. ఇప్పుడైనా రోడ్డు వేయాలని విన్నవించారు. పాండు, వెంకటయ్య, రాజు, కేశవులు, శివ, మైబు, సుధాకర్, అంజిలయ్య తదితరులు ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

జాతీయస్థాయిలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన కింగ్‌షోటోకాన్ క్లబ్ విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన నేషనల్ లెవల్ కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన కింగ్ షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు పతకాలు సాధించినట్లు క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. మహ్మద్ అర్ష్ జమీల్ కటాస్‌తో ఓపెన్ గ్రాండ్ చాంపియన్‌షిప్ సాధించి రూ.15వేలు, అమాన్ ఖాన్ 14 ఏళ్ల విభాగంలో బంగారు పతకం, గ్రాండ్ చాంపియన్‌షిప్ రూ.వెయ్యి నగదు, అండర్–12 ఏళ్ల విభాగంలో సాబేర్‌పాష బంగారు పతకంతో పాటు ద్వితీయ గ్రాండ్‌చాంపియన్‌షిప్ సాధించినట్లు తెలిపారు. ఆయా విభాగాల్లో మహ్మద్ ఉజేఫ్ షరీఫ్, ఆది నవీన్‌కుమార్, సాయి ప్రణీత్, సూఫియాన్ అలీ, మెహవిష్‌ఖాన్ బంగారు పతకాలు, మెహవిష్ మోనాల్, ఫర్హాన్‌అలీ, ఒవేస్ రజత పతకాలు, అమాన్‌అలీ, ఒవేజ్‌లు కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు.

జడ్చర్లలో..

జడ్చర్లలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో మహబూబ్‌నగర్ మండలంలోని జైనల్లీపూర్ చెందిన జీకే షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు పతకాలు సాధించినట్లు సీనియర్ మాస్టర్ బి.శ్రీధర్‌గౌడ్ తెలిపారు. దీక్షిత్, చంద్రకాంత్, శివకుమార్, లక్ష్మి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు, లాస్య, స్వాతి, శివాని, పవిత్ర, సిద్ధార్థ్, యోగి, చరణ్, జ్ఞానప్రియ ద్వితీయస్థానంలో రజత పతకాలు సాధించినట్లు తెలిపారు.

డైట్ కళాశాల బ్రాంచ్ విద్యార్థులు..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల జీకే షోటోకాన్ బ్రాంచ్ విద్యార్థులు పతకాలు సాధించినట్లు సీనియర్ కరాటే మాస్టర్ శివకుమార్ తెలిపారు. బ్లాక్‌బెల్టు విభాగంలో దామోదర్, బ్రౌన్ బెల్టు విభాగంలో అక్షయ్‌కుమార్, టీమ్‌కటాస్ విభాగంలో సంజయ్ టీమ్ గ్రాండ్‌చాంపియన్‌షిప్ సాధించినట్లు తెలిపారు.

మిడ్జిల్: పట్టణంలోని స్లేట్ గ్రామర్ స్కూల్ విద్యార్థులు గోల్డ్‌మెడల్, సిల్వర్ మెడల్ సాధించడంపై సోమవారం పాఠశాల వద్ద విద్యార్థులను అభినందించారు.

ప్రైవేట్ స్కూల్ టీచర్లను ఆదుకుంటాం



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, వేదికపై ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్సీ వాణీదేవి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పలు ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను అన్ని విధాల ఆదుకుంటామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇళ్లు లేని వారికి నిర్మించుకునేందుకు సాయం చేస్తామని, డబుల్ బెడ్రూం కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇస్తామన్నారు. హెల్త్ కార్డుల విషయంలో పూర్తి సహకారం అందించించి, కార్డులు వచ్చే విధంగా చూస్తామన్నారు. ఎమ్మెల్సీ వాణీదేవి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసని, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

అభివృద్ధితో రాష్ట్రంలో ఎంతో మార్పు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అభివృద్ధిలో రాష్ట్రం ఎంతో మార్పు చెందిందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బాలాజీ టైల్స్, గ్రానైట్ వర్కర్స్ ఆధ్వర్యంలో వలసపోయి సొంత గ్రామాలకు తిరిగి వచ్చిన 300 మంది వరకు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అప్పుడు బతుకుదెరువు అంటే ముంబాయి వలసలు, ఇప్పుడు మాత్రం జిల్లా కేంద్రం కేరాఫ్‌గా మారిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన పదేళ్లలో ఊహించని విధంగా అభివృద్ధి చెందిందన్నారు. ఎన్నికలు వస్తున్నాయని మళ్లీ కొన్ని చీడ పురుగులు పుట్టుకొస్తున్నాయని వారితో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ విప్ బాల్కసుమన్ మాట్లాడుతూ.. గతంలో జిల్లా కేంద్రం బోసిపోయి ఉండేదని, ఇప్పుడు విశాలమైన రోడ్లు, కేసీఆర్ పార్క్, ట్యాంక్‌బండ్, శిల్పారామం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, అనేక రకాల అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఉన్న 14 ఎమ్మెల్యే స్థానాలను బీఆర్ఎస్ గెలుచుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాణీదేవి, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, ముడా చైర్మన్ వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

అడ్డాకుల: మండలంలోని కన్మనూర్‌లో 11 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు సోమవారం వేదపండితుడు సురేష్‌స్వామి ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. గ్రామానికి చెందిన స్థల దాతలు వెంకట్రామారెడ్డి కుటుంబ సభ్యులతో పూజ చేయించారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, అగ్గి రాములు, కృష్ణయ్య, ప్రశాంత్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, బోయ ప్రవీన్, రవిసాగర్, శ్రీను, బాలపీరు తదితరులు ఉన్నారు.

12మంది సెల్‌ఫోన్లు అప్పగింత



మహబూబ్‌నగర్ క్రైం: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు సందర్భాల్లో చోరీకి గురైన 12మంది బాధితుల సెల్‌ఫోన్‌లను సోమవారం స్టేషన్‌లో సీఐ సైదులు అందజేశారు. సీఐ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని కూరగాయల రైతు మార్కెట్, టీడీ గుట్ట ఏరియాల్లో కొన్ని రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సెల్‌ఫోన్‌లతో పాటు బాధితులు పోగొట్టుకున్నారు. ఫిర్యాదుల మేరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గుర్తించినట్లు తెలిపారు.

పార్టీ పటిష్టతకు కమిటీలు

భూత్పూర్: గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేయడానికి కమిటీ వేస్తున్నట్లు మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని కరివెనలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆర్టీసీ రాయితీ బస్‌పాస్ క్యాంప్

స్టేషన్ మహబూబ్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని ఎదిర వార్డులో సోమవారం దివ్యాంగులకు ఆర్టీసీ రాయితీ బస్సుపాస్‌ల క్యాంప్ నిర్వహించారు. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు సమర్పించి పాస్‌లు అందుకున్నారు. అదే విధంగా కండక్టర్ నర్సింహులు, వార్డు కౌన్సిలర్ యాదమ్మ చెరో రూ.5వేల సొంత డబ్బులతో నిరుపేద విద్యార్థులకు 100 పాసులు అందజేశారు. కార్యక్రమంలో చిన్న హన్మంతు, ఎల్లయ్య, చంద్రశేఖర్, రాములు, అజీజుల్లా, తిరుపతిరెడ్డి, ఎదిర ఆర్టీసీ విలేజ్ బస్‌ఆఫీసర్ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బస్‌పాస్‌లు అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: భవన నిర్మాణ కార్మికులకు అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ బిల్డింగ్, ఇతర నిర్మాణ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో బైపాస్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వెళ్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి మేడే సందర్భంగా భవన నిర్మాణ కార్మికులకు రెండు లక్షల బైకులు ఇవ్వనున్నట్లు ప్రకటించి, రెండు పర్యాయాలు మేడేలు గడిచినా వాటిని మాత్రం పంపిణీ చేయలేదన్నారు. తక్షణమే తెలంగాణ లోని కార్మికులందరికి 20 లక్షల బైకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ ఏఓ శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో వరద లక్ష్మయ్య, కుమార్, వెంకటేష్, హన్మంతు, కృష్ణయ్య పాల్గొన్నారు.

రెండవ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రెండవ ఏఎన్ఎంలను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణచౌరస్తాలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. సమ్మె 14వ రోజుకు చేరుకున్న సందర్భంగా చేపట్టిన ధర్నా కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, ప్రధాన కార్యదర్శి మంజుల మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. అదేవిధంగా కాంట్రాక్టు ఏఎన్ఎంలను పర్మనెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి డిమాండ్ చేశారు. యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వెళ్లి ఏఓ శంకర్‌కు వినతిపత్రం సమర్పించారు.

అద్దెవాహనాల బిల్లులు చెల్లించండి



డీటీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వివిధ శాఖల్లో అధికారులకు నడుస్తున్న అద్దె వాహనాలకు సంబంధించి బిల్లులు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ హైర్ వెహికిల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదర్ డిమాండ్ చేశారు. సోమవారం డీటీఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆ వాహనాలకు చెందిన బిల్లులకు టోకన్లు పడి నెలలు గడుస్తున్న బిల్లులు విడుదల కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అద్దెవాహనాల యాజమాలు అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బిల్లులు రాకపోవడంతో కుటుంబ సమేతంగా ఆత్మహత్యలు చేసుకోవడమే శరణ్యమని అన్నారు. కార్యక్రమంలో దస్తగిరి, ఆంజనేయులు, అలీం, ఇర్ఫాన్, నిరంజన్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పిస్తాం

భూత్పూర్: బీఆర్ఎస్ పాలనలో ఎస్సీ, ఎస్టీలు తీవ్ర అన్యాయానికి గురయ్యారని, రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, వారికి రిజర్వేషన్ చేసి తీరుతామని డీసీసీ అధ్యక్షుడు మధుసుదన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణం, అమిస్తాపూర్‌లో అంబేద్కర్ విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. ఎస్సీలకు 18శాతం, ఎస్టీలకు 12శాతం రిజర్వేషన్ కల్పించి తీరుతామన్నారు.

నవాబుపేట: కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించిన సందర్భంగా సోమవారం జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.

బాలానగర్: రిజర్వేషన్ల పెంపుపై కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో ఉందని మండల ప్రధాన కార్యదర్శి శంకర్‌మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాల వేసి నివాళి అర్పించారు.



భూత్పూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భక్తిశ్రద్ధలతో మహంకాళమ్మ బోనాలు



రాజాపూర్: మండలంలోని రాయపల్లిలో సోమవారం కురుమయాదవులు మహంకాళమ్మ బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకుని గ్రామంలో ఊరేగించిన అనంతరం బొడ్రాయికి పూజలు నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి బీరప్ప ఆలయం వద్ద అమ్మవారికి బోనాలను సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు.

ఉపాధ్యాయురాలికి నంది అవార్డు

జడ్చర్ల టౌన్: పట్టణానికి చెందిన కూచిపూడి నృత్య ఉపాధ్యాయురాలు వీణాశర్మకు మంజునాథ ఫౌండేషన్ ప్రతిభ నంది అవార్డు దక్కింది. ఈ మేరకు సోమవారం రవీంద్ర భారతిలో కూచిపూడికి చెందిన చిన్నారులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అనంతరం వీణాశర్మను ఫౌండేషన్ నిర్వహకులు అవార్డును అందించి సత్కరించారు. కార్యక్రమానికి హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



హర్యాన గవర్నర్‌తో ఉపాధ్యాయురాలు వీణాశర్మ

మెట్టుకాడి శ్యాంసుందర్‌కు..


స్టేషన్ మహబూబ్‌నగర్: మంజునాథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రతిభావంతులకు అవార్డులతో సత్కరించారు. జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ డ్యాన్స్ మాస్టర్ మెట్టుకాడి శ్యాంసుందర్ హర్యాన గవర్నర్ దత్తాత్రేయ చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రానికి చెందిన వర్ష కల్చరల్ అకాడమీ విద్యార్థుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



జేపీఎన్‌సీలో ప్రేరణ తరగతులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జయప్రకాష్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రేరణ తరగతులను సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ రవికుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్నారు. కళాశాలలో ఎన్‌సీసీతో పాటు మెరుగైన ల్యాబ్‌లు తదితర సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజీవన్, కార్యనిర్వహణ అధికారి లింగన్‌గౌడ్ కులకర్ణి, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రాఖీలను నిషేధించాలి



చిన్నచింతకుంట: ప్లాస్టిక్ రాఖీలను నిషేధించి, పర్యావరణానికి మేలు చేసే వస్తువులతో తయారు చేసిన రాఖీలను వినియోగించాలని అప్పంపల్లి జెడ్పీహెచ్ఎస్ క్రాఫ్ట్ టీచర్ కవిత సూచించారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులతో మునగ విత్తన రాఖీలను తయారు చేయించారు.

వర్షాలు కురవాలని పూజలు

దేవరకద్ర రూరల్: వర్షాలు సమృద్ధిగా కురవాలని సోమవారం కౌకుంట్ల, జీన్గురాలలో గ్రామస్తులు శివాలయంలో ప్రత్యేక పూజాలు చేశారు. పోలిమేరల నుంచి బిందెలతో నీటిని తీసుకొని భజన కీర్తనలను ఆలపిస్తూ శివాలయానికి చేరుకుని, ఆలయంలోని శివలింగంను జలదిగ్బందం చేశారు. వరుణ దేవుడు కరుణించేలా చూడాలని శివయ్యను వేడుకున్నారు.



ఎన్ఎస్‌యూఐ కమిటీ ఎన్నిక

స్టేషన్ మహబూబ్‌నగర్: ఎన్ఎస్‌యూఐ విభాగం అసెంబ్లీ అధ్యక్షుడిగా శ్రీరామ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మణిరత్నం నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్ నియామకపత్రం జారీ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారికి ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అవేజ్ అహ్మద్ నియామకపత్రాలు అందించారు.

ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా..

నవాబుపేట: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని చౌడూర్ సర్పంచ్ వెంకటన్‌ను నియమించారు. సోమవారం డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆయనకు నియామకప్రతం అందించారు.